సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
బుధవారం 5-2-2025
సంపుటి: 20 సంచిక : 266
పేజీలు: 8 వెల: రూ.1/-



• ఎడిటోరియల్

# రోషమో అభిమానమో ఉండాలి కదా!

తమ పౌరులను అవమానకరంగా వెనక్కి తరలిస్తే ఒప్పుకునేది లేదని కొలంబియా, మెక్సికోలు అమెరికా సైనిక విమానాలను దిగనివ్వలేదు. ఆ మాత్రం ఆత్మాభిమానం కూడా మన దేశభక్తులకు లేకపోయింది. పక్క దేశాల మీద, బక్క ప్రాణుల మీద వీరంగం వేసే వీర జాతీయులు, అమెరికా ముందు మాత్రం మచ్చికైపోయి మోకరిల్లుతారు! అమెరికన్ మిలటరీ విమానంలో అమృతసర్‌లో ఇవాళ డంప్ అయిన భారతీయులకు పూర్తి సంఘీభావం! అక్రమ వలసదారులని ప్రపంచంలో ఎవరినైనా అనగలిగే కనీస అర్హత లేని ట్రంపిస్టు అమెరికాకు పూర్తి తిరస్కారం! దేశభక్తి, మాతృప్రేమ విస్మరించి మనోళ్లు అక్కడి ఆర్థిక వ్యవస్థను ఎంతగా అభివృద్ధి చేశారు? మొదట అక్కడి క్రైస్తవానికి తలొగ్గినట్టే ఒగ్గి క్రమంగా ఎన్ని గుళ్లూ గోపురాలు కట్టి ఇక్కడి కులమతాల్ని అక్కడ ఎంతగా వృద్ధి చేశారు? అక్కడి జిడిపిని పెంచి ఇక్కడి రియల్ ఎస్టేట్‌ని ఎంతగా ఆకాశ మార్గం పట్టించారు? ట్రంప్‌ను మన ప్రధాని కౌగిలించుకొని ఇచ్చిన ఫోజులన్నీ వట్టివేనా? అక్కడికి ప్రధాని వెళ్లినప్పుడు దిగ్విజయ స్వాగతం పలికిన భారతీయత మీద అతనికుండే వివక్ష మీద ఎందుకని ఎవ్వరూ మాట్లాడరు? గెంటేయించుకోవడంలో వుండే యాతనని భరించలేక ఇప్పుడు మనోళ్లు ఉత్తరం దిక్కువైపు సమూహంగా నించుని ఉచ్చపోసి యుద్ధం లాంటివేవైనా చేస్తే సమస్యకి పరిష్కారం ఏమైనా దొరుకుతుందా? (రాబోయే తండేల్ సినిమాలో డైలాగ్) అమెరికాకి దశాబ్దాలుగా తలొగ్గిన మన విదేశాంగ విధానం మీదైనా వాడు కనీస జాలి చూపడం లేదే? అమెరికా ఎన్నికల్ని ప్రభావితం చేస్తున్న భారతీయ సంతతి అని వాణిజ్య ప్రకటనల కోసం ఆత్రుతగా ఉబ్బరిచ్చే అక్షరాల సిందేసే మీడియా ఇప్పుడు గ్లిజరిన్ కన్నీళ్లయినా అరువు తెచ్చుకుంటుందా? తానా, ఆటాల విందారగించిన సాహిత్యకారులైనా ఇప్పుడు ట్రంప్‌తో ఏదైనా సయోధ్య కుదుర్చుతారా? ఇకనుంచి మనం అమెరికన్ సామ్రాజ్యవాదం నశించాలి అనకుండా, భారతీయుల పట్ల అమెరికా వివక్ష నశించాలని కొత్త నినాదం చేయాలి. ఏదేమైనా ఇక్కడి శతాబ్దాల వంచనాత్మక బహిష్కరణ విష సంస్కృతితో పాటు, బలిసిన నాగరికతకు, బలహీన సంస్కృతికీ మధ్య తేడాను తెలుసుకోవాల్సిన సందర్భం వచ్చిపడింది. మోడీ వచ్చాక ఈ దేశపు వీసాల కోసం ప్రపంచమంతా క్యూ కడుతుందనుకుంటే, దీనికి విరుద్ధంగా ఈ దేశం నుంచి ఎన్నడూ లేనంత వలసలు అమెరికాకి పెరిగాయి, అందుకే, మోడీ, తన స్నేహితుడు అధికారంలోకి రాగానే వాళ్లందరినీ తన్ని మరీ తరిమేయించాడు. విదేశీయులు వీసాల కోసం క్యూ కట్టడం తర్వాత, ముందు మనవాళ్లను పారిపోకుండా కాపాడుకుందాం! డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి రాగానే అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపిన అమెరికా ప్రభుత్వం కొంతమంది భారతీయులను కూడా వెనక్కి పంపిన సంగతి తెలిసిందే. చట్టవ్యతిరేకంగా అగ్రరాజ్యంలో అడుగుపెట్టిన వారిని ప్రత్యేక విమానంలో స్వదేశానికి పంపింది. 205 మందితో టెక్సాస్ నుంచి బయల్దేరిన అమెరికా సైనిక విమానం సీ-17 బుధవారం మధ్యాహ్నం పంజాబ్‌లోని అమృత్‌సర్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులో దిగింది. వీరంతా పంజాబ్, దాని చుట్టుపక్కల రాష్ట్రాలకు చెందినవారిగా తెలుస్తోంది. అయితే, వీరిని అదుపులోకి తీసుకునేందుకు స్వదేశంలో ఎలాంటి ఆదేశాలు లేవని సమాచారం. అవసరమైన తనిఖీల అనంతరం ఎయిర్‌పోర్టు నుంచి బయటకు పంపించనున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. వెనక్కి పంపేముందు ప్రతిఒక్కరి రికార్డులను పరిశీలించినట్లు ఢిల్లీలోని అమెరికా ఎంబసీ అధికారులు వెల్లడించారు. రానున్న రోజుల్లో మరిన్ని విమానాలు అమెరికా నుంచి భారత్‌కు రానున్నాయని వివరించారు. అమెరికా హోంలాండ్ అధికారుల లెక్కల ప్రకారం 20,407 మంది భారతీయుల వద్ద సరైన పత్రాలు లేనట్లు గుర్తించిన అధికారులు 17,940 మందిని వెనక్కి పంపేందుకు తుది ఉత్తర్వులు జారీ చేశారు. 2,467 మంది ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ రిమూవల్ ఆపరేషన్స్ (ఈఆర్‌వో) నిర్బంధంలో ఉన్నారు. తొలివిడతలో భాగంగా 205 మందిని వెనక్కి పంపించారు. అక్రమవలసదారులపై ట్రంప్ మొదటి నుంచి కఠినంగా ఉంటున్నారు. ఆయన పదవీ బాధ్యతలు చేపట్టడంతో వారి గుర్తింపు, తరలింపు ప్రక్రియను వేగవంతం చేశారు. ఈ క్రమంలోనే ఎల్ పాసో, టెక్సాస్, శాన్ డియాగో, కాలిఫోర్నియాలో ఉన్న 5వేల మంది అక్రమ వలసదారులను ఆయా దేశాలకు తరలించేందుకు పెంటగాన్ సిద్ధమైంది. ఇప్పటికే కొంతమందిని సైనిక విమానాల్లో గటేమాలా, పెరు, హొండూరస్ తదితర దేశాలకు తరలించింది. అక్రమ వలసదారులపై అమెరికా అనుసరిస్తున్న విధానాల పట్ల ఇప్పటికే భారత్ తన స్పందనను తెలిపింది.

# రథసప్తమి వేడుకలు సరికొత్త అనుభూతి



- జిల్లా అధికార యంత్రాంగం సమిష్టికృషి అభినందనీయం
- గౌరవ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్ర పండుగ రథ సప్తమి వేడుకల్లో భాగంగా అరసవల్లి సూర్య నారాయణ స్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌక ర్యం లేకుండా జిల్లా అధికార యంత్రాంగం చేసిన కృషి అభినందనీయమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. విజయవాడ నుంచి ఆయన జిల్లా అధికారులతో మాట్లాడారు. జిల్లాలోని రథసప్తమి వేడుకలు నభూతో నభవిష్యత్ అన్న రీతిలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ ఉత్సవాలకు సహకరించిన ప్రజలకు అభినందనీయ మన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎక్కడ ఇబ్బందులు కలగకుండా సజావుగా ఉత్సవాలు నిర్వహించిన రాష్ట్రపండుగగా అరసవల్లి కీర్తిని ప్రతిష్టతను పెంచగలిగారన్నారు. మూడురోజుల పాటు నిర్వహించిన ఈ వేడుకల కోసం గత నెలరోజులుగా శ్రమించిన అధికార యంత్రాంగాన్ని మంత్రి అభినందించారు.

# ఎండీయుల సేవలు అదరహో..



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ రథసప్తమి ఉత్సవాల సందర్భంగా ఎండీయుల ఆపరేటర్ల అసోసియేషన్ ఆధర్యంలో భక్తులకు అన్నప్రసాదం అందజేసి అదరహో అన్పించారు. నగరంలోని ఎన్‌జీవో హోంలో ఈ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎండియూ అసోసియేషన్ ఆధ్వర్యంలో రథసప్తమి రాష్ట్రపండుగ సందర్భంగా స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు వెజ్‌బిర్యానీతో పాటు మంచినీటి సదుపాయాన్ని సంబంధిత ప్రతినిధులు అందజేశారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని సీఎస్‌డీటీలు చక్రవర్తి, రామకృష్ణ, సత్యనారాయణ మరికొందరు డీటీల పర్యవేక్షణలో ప్రారంభించారు. ప్రభుత్వం రాష్ట్ర పండుగగా రథసప్తమి వేడుకను ప్రకటించడంతో జిల్లాయంత్రాంగం అందుకు తగ్గ ఏర్పాట్లను చేసిన క్రమంలో స్వచ్చంద సంస్థలు కూడా పెద్దఎత్తున ముందుకు రావాలని పిలుపుతో ఎండియూ అసోసియేషన్ తరుపున రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రౌతు సూర్యనారాయణ ముందుకు వచ్చి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండియూ ఆపరేటర్లు వృత్తిలోనూ, అలాగే సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారని, ఇదే స్పూర్తితో ముందుకు వెళ్లాలని సూచించారు. సుమారుగా ఎనిమిది వేల మంది భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. అనంతరం రౌతు సూర్యనారాయణ మాట్లాడుతూ స్వామివారి భక్తులకు వెజ్ బిర్యానీని అందజేయడం తమకెంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. అందరి సభ్యుల సహకారంతో ఇంతటి మంచి కార్యక్రమం చేశామని, తాము బియ్యం పంపిణీ కార్యక్రమంతోపాటు పలు సామాజిక సేవా కార్యక్రమాలను చేస్తున్నట్లు, అందులో భాగంగానే మంగళవారం ఈ కార్యక్రమాన్ని చేసినట్లు చెప్పారు. రాష్ట్ర, జిల్లా ఎండీయు ఆపరేటర్ల అసోసియేషన్ సభ్యులకు మంచి జరగాలని అరసవల్లి ఆదిత్యున్ని మనసారా వేడుకున్నామని రౌతు సూర్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండీయూ ఆపరేటర్స్ యూనియన్ జిల్లా ట్రెజరర్ పైడి వరాహ నరసింహులు, అర్బన్ ఎండియూ ఆపరేటర్స్ అప్పారావు, రాజా, వరుణ్, కిషోర్, సంతోష్, దివాకర్, షేర్ ఖాన్, శంకర్, మాధవ్, పిడుగు నరేష్, జగన్, కిరణ్, ఈశ్వర్, సాయికిరణ్, రాజు, కిట్టు తదితరులు ఉన్నారు.

# "హంసవాహిని" పుస్తక బహుకరణ

(సత్యంన్యూస్, పొందూరు)

తెలుగు రచయితల వేదిక(తెరవే) ఆధ్వర్యంలో తాజాగా ప్రచురించిన హంసవాహిని (కవితా సమాహారం) పుస్తకాన్ని స్థానిక ఎస్బీఐ చీఫ్ మేనేజర్, తెలుగు భాషాభిమాని సీహెచ్ ప్రసాదరావుకు నామవిజ్ఞానవేత్త, తెరవే క్రియాశీలక ప్రతినిధి వాండ్రంగి కొండలరావు బుధవారం బహుకరించారు. అలాగే కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య అవార్డు గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు రాసిన "ఈ కాలం పిల్లాడు" (బాలల నవల)ను కూడా ఈ సందర్భంగా అందజేశారు. తెలుగు భాషా, సంస్కృతులను పరిరక్షించుకోవలసిన గురుతర బాధ్యత సమాజంపై ఉందన్నారు. తెలుగు రచయితల వేదిక సభ్యులను, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావును ప్రత్యేకంగా అభినందించారు.



# ప్రతి ఇంట్లో భగవద్గీత ఉండాలేనిదే ఆకాంక్ష

(సత్యంన్యూస్, అరసవల్లి)

భక్తులకు భగవద్గీత అందించటం ఆనందంగా ఉందని, ప్రతి ఇంట్లో భగవద్గీత ఉండాలన్నదే తమ ధ్యేయమని సూర్యముఖి హాస్పిటల్ యాజమాన్యం బుధవారం అన్నారు. అరసవిల్లి ప్రత్యక్ష దైవం సూర్యనారాయణస్వామి రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీకాకుళం సూర్యముఖి హాస్పిటల్ మేనేజ్‌మెంట్ పల్లి జగదీష్, తేజ, హాస్పిటల్ సిబ్బంది కలసి వెయ్యి భగవద్గీత పుస్తకములు, ఉచిత పులిహోర ప్రసాదం, అందరికీ వాటర్ బాటిల్స్ భక్తులకు అందించామన్నారు. హైందవ ధర్మాన్ని విస్తృతం చేసే ప్రక్రియలో భాగంగా ప్రతి ఇంట్లో భగవద్గీత ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేశామన్నారు. అలాగే స్వామివారి వేడుకలు రాష్ట్ర పండుగలలో భాగంగా భక్తులకు ఏ ఇబ్బందులు కలగకుండా అధికారులు చూపిన చొరవ అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సూర్యముఖి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# కపూర్ బ్యూటీ పొడుగు కాళ్ల అందం చూశారా!



బాలీవుడ్ బ్యూటీ వాణి కపూర్ ఇండస్ట్రీలో అడుగు పెట్టి దశాబ్ద కాలం అయ్యింది. కెరీర్ ఆరంభంలో ఒడిదొడుకులు ఎదుర్కొన్నా ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారింది. ఈ ఏడాది వాణి కపూర్ నుంచి మూడు భారీ బడ్జెట్ సినిమాలు రాబోతున్నాయి. ముద్దుగుమ్మ మూడు సినిమాల్లోనూ హీరోయిన్‌గా నటించడం ద్వారా ఈ అమ్మడు తన స్థాయిని మరింత పెంచుకోబోతుంది. టాలీవుడ్‌లో ఈమె కేవలం ఒకే ఒక్క సినిమా ఆహా కళ్యాణం సినిమాలో కనిపించింది. నాని హీరోగా నటించిన ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద బొక్క బోర్లా పడింది. దాంతో మళ్లీ సౌత్‌లో ఈ అమ్మడు కనిపించడం లేదు. బాలీవుడ్‌కే ఈ అమ్మడు పరిమితం అయ్యింది. సౌత్‌లో ఈమె సినిమాలు రాకున్నా సోషల్ మీడియాలో ఫోటోలతో అన్ని చోట్ల వైరల్ అవుతోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో దాదాపుగా 8 మిలియన్ల ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న వాణి కపూర్ రెగ్యులర్‌గా సోషల్ మీడియా ద్వారా అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. తాజాగా మరోసారి తన అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలిచింది. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం. మూడు పదుల వయసు దాటినా పాతికేళ్ల పడుచు అందాలతో వాణి కపూర్ చూపు తిప్పుకోనివ్వడం లేదంటూ నెటిజన్స్ ఈ ఫోటోలకు కామెంట్స్ చేస్తున్నారు. సాధారణంగానే వాణి కపూర్‌ని పొడుగు కాళ్ల సుందరి అంటారు. అలాంటి వాణి కపూర్ లో యాంగిల్‌లో తన కాళ్ల అందాన్ని చూపిస్తూ కన్నుల విందు చేస్తూ ఉంటే ఇంకా ఏమైనా ఉందా... ముద్దుగుమ్మ ఫోటోకి లక్షల లైక్స్ రావాల్సిందే. ఈ ఫోటోను వాణి కపూర్ షేర్ చేసిన గంటల వ్యవధిలోనే వేలల్లో లైక్స్, షేర్స్ దక్కాయి. తన పొడుగు కాళ్ల అందంను ఇలా చూపించడం ద్వారా మరింత ఈ అమ్మడు పాపులారిటీని సొంతం చేసుకుంది. ఇంతటి అందంకు ఇన్నాళ్లు ఎందుకు ఆఫర్లు రాలేదు అనేది ఆశ్చర్యంగా ఉంది అంటున్నారు. ఇకపై అయినా ఈమె వరుసగా సినిమాలు చేయాలని అభిమానులు, సోషల్ మీడియా ఫాలోవర్స్ కోరుకుంటున్నారు. వాణి కపూర్ తాజా ఫోటోలతో మరోసారి వార్తల్లో నిలిచింది. పొడుగు కాళ్లతో ఎప్పుడూ అందరి దృష్టిని ఆకర్షించే ఈ అమ్మడు మరోసారి అదే తరహాలో తన అందంతో కన్నుల విందు చేస్తుంది. ప్రస్తుతం బాలీవుడ్‌లో ఈ అమ్మడు రైడ్ 2, అబీర్ గులాల్ సినిమాల్లో నటిస్తోంది. ఈ ఏడాదిలోనే ఆ రెండు సినిమాలు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. వాటితో పాటు బడ్డమీజ్ గిల్ సినిమాలోనూ వాణి కపూర్ నటిస్తోంది. పలు అవార్డులు రివార్డులు అందుకున్న ఈ అమ్మడు ఓటీటీ ఎంట్రీకి సైతం ఆసక్తి చూపిస్తుంది. త్వరలోనే ఈ అమ్మడి నుంచి ఒక వెబ్ సిరీస్ వచ్చే అవకాశాలు ఉన్నాయని సమాచారం అందుతోంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. - తుపాకి.కామ్ సౌజన్యంతో...

# చిరంజీవితో సందీప్‌రెడ్డి వంగా!



చిరంజీవి అంటే సందీప్‌రెడ్డి వంగాకు వల్లమాలిన అభిమానం. 'నా అభిమాన హీరో చిరంజీవి' అని ఆయన చాలా సందర్భాల్లో చెప్పుకొన్నారు. 'మాస్టర్'లో చిరంజీవి సిగరెట్ కాల్చే సీన్ తనకు చాలా స్ఫూర్తి ఇచ్చిందని ఓ ఇంటర్వ్యూలో చెప్పారు సందీప్. ఈమధ్య ఇన్‌స్టాలో పోస్ట్ చేసిన చిరు ఫొటో బాగా వైరల్ అయ్యింది. చిరుపై సందీప్‌కు ఉన్న ప్రేమకు అది నిదర్శనం. సందీప్ రెడ్డితో చిరంజీవి ఓ సినిమా చేసే అవకాశాలు ఉన్నాయని ఇండస్ట్రీ వర్గాలు మాట్లాడుకొంటున్నాయి. ఈ విషయమై సందీప్- చిరు మధ్య భేటీ కూడా జరిగిందట. సందీప్ స్టైల్ వేరు, చిరు ఇమేజ్ వేరు. ఈ రెండింటికీ ఎలా పొంతన కుదురుతుందన్నది అందరి అనుమానం. యానిమల్‌లో అనిల్ కపూర్ క్యారెక్టర్‌ని డిజైన్ చేసినట్టు చిరంజీవి కోసం ఓ పాత్ర రాసుకొంటే..అదిరిపోతుంది. చిరుతో పూర్తిస్థాయిలో ఓ సినిమా తీసినా తీయకపోయినా, తాను రాసుకోబోయే కథల్లో చిరు కోసం సందీప్ ప్రత్యేకంగా ఓ పాత్రని సృష్టించినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. ఈమధ్య హీరోల తీరు మారింది. 'నేను హీరోనే' అని కట్టుబడి ఉండడం లేదు. నవతరం దర్శకులు, ముఖ్యంగా తమకు నచ్చిన దర్శకులతో పని చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. చిరు కూడా అలానే ఆలోచిస్తే సందీప్ - చిరు కాంబో ఫిక్సయినట్టే. ఏం చెప్పగలం..? రేపు రాబోయే 'స్పిరిట్'లో చిరు కోసం సందీప్ ఓ పాత్ర సృష్టించినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. ఓ వైపు ప్రభాస్, మరోవైపు చిరు.. మధ్యలో సందీప్ రెడ్డి వంగా. చూడ్డానికి రెండు కళ్లూ సరిపోవు. ఏమో.. గుర్రం ఎగరా వచ్చు. - తెలుగు 360.కామ్ సౌజన్యంతో...

# లేబర్ కోడ్లను రద్దు చేయాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్‌కోడ్లను రద్దు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.హెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి డిమాండ్ చేసారు. లేబర్ కోడ్లుకు వ్యతిరేకంగా కార్మిక హక్కులు పరిరక్షించాలని, ఆహర పంటలకు కనీస మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని కోరుతూ సిఐటియు, కార్మిక రైతు సంఘాలు ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ముందుగా ఆర్&బి రోడ్ నుండి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం ముందు నుంచి కార్మికవర్గం అనేక త్యాగాలతో పోరాడి సాధించుకున్న 29కార్మిక చట్టాలను కేంద్రప్రభుత్వం రద్దుచేసిందన్నారు. కోవిడ్ కాలంలో దుర్మార్గంగా పార్లమెంట్లోను, బయట ఎటువంటి చర్చ జరగకుండా లేబర్ కోడ్లను ఆమోదించిందన్నారు. మోడీ 3వ ప్రభుత్వంలో అమలు చేయడానికి సిద్ధంగా ఉందని ఎప్పుడైనా అమలు ఉత్తర్వులు ఇస్తామని ఇటీవల ఆర్థికశాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారని ఆందోళన వ్యక్తం చేసారు. కార్మికవర్గానికి ప్రస్తుతం వున్న కొద్దిపాటి హక్కులను కుదించడమే లేబర్ కోడ్‌ల ముఖ్య ఉద్దేశం అని అన్నారు. కార్మికహక్కులు కాలరాసి పెట్టుబడిదారులకు పెద్దపీఠ వేయడానికి లేబర్ కోడ్లు వచ్చాయన్నారు. గతంలో అత్యవసర సర్వీసుల్లోనే సమ్మెనోటీసు ఇవ్వాలని, నేడు అన్ని రంగాలకు విస్తరింపచేశారన్నారు. మరోవైపున యజమానులు ఏ చట్టాల అమలును ఉల్లంఘించినా తనిఖీలు లేకుండా చేశారన్నారు. అందువల్లే ప్రతి రోజు కార్మికులు ఫ్యాక్టరీల్లో ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. లేబర్ కోడ్‌ల ఉల్లంఘన వల్ల ప్రాణానికే భద్రత లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మోహనరావు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.సింహాచలం మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల బడ్జెట్ అని అన్నారు. వ్యవసాయానికి, గ్రామీణాభివృద్ధికి నిధులు తగ్గించారన్నారు. ఉపాధి హామీ పథకానికి సరిపడా నిధులు కేటాయించలేదన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎన్.వి. రమణ, అల్లు సత్యన్నారాయణ, ఆర్.ప్రకాష్, కె.సూరయ్య, పి.గోపి, అంగన్వాడీ యూనియన్ కె.కళ్యాణి, రాజేశ్వరి, ఆశ వర్కర్స్ యూనియన్ డి.ధనలక్ష్మి, పి.జయలక్ష్మి, మధ్యాహ్నం భోజనం పథకం వర్కర్స్ యూనియన్ బి.ఉత్తర, సుశీల, వి.లక్ష్మీ, వివిధ యూనియన్‌ల నాయకులు డి.వాసుదేవరావు, టి.త్రినాథరావు, ఎల్.రామప్పడు, మన్యం రమణ, రవికుమార్, వెంకటరమణ, బి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



# సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. ఈమేరకు బుధవారం తన కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. శ్రీకాకుళం రూరల్ మండలం గార మండలం పట్టణం నుంచి వచ్చిన ఫిర్యాదారుల నుంచి ఫిర్యాదు సేకరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలు సమస్యలను నేరుగా తన కార్యాలయాన్ని తెలియజేయాలని, తమ దృష్టికి తీసుకువస్తే ఆయా శాఖ అధికారులకు సమాచారం ఇచ్చి సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే ప్రజాదర్బార్ ద్వారా అనేక సమస్యలు పరిష్కరించామన్నారు. అందువల్ల ప్రజలు నేరుగా వారి సమస్యలు తెలియజేయాలని సూచించారు



జాతీయ స్థాయి ఉపాధ్యాయ సదస్సుకు

# ఉద్దానం ఉపాధ్యాయుడు

(సత్యంన్యూస్, పలాస)



రాష్ట్ర విభజనకు ముందు ఉపాధ్యాయునిగా ఎంపికై ప్రస్తుతం తెలంగాణలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న ఉద్దాన ప్రాంత గ్రామమైన మందస మండలం భేతాళపురానికి చెందిన కీలు ఖగపతి మాష్టారును ఈ నెల 6 నుండి 20 వ తేది వరకు ఢిల్లీలోని సీసీఆర్‌టీ (సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్స్ & ట్రైనింగ్) లో" నూతన విద్యా విధానం-2020లో తోలుబొమ్మల పాత్ర" అనే అంశంపై జరిగే జాతీయ స్థాయి సదస్సు & శిక్షణ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ ఎస్‌సీఈఆర్‌టీ తమ రాష్ట్రం తరపున ఎంపిక చేశారు. ఉద్దాన ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి ఒక రాష్ట్ర ప్రభుత్వం తరపున జాతీయస్థాయి సదస్సుకు ఎంపిక కావడం పట్ల ఉద్దాన ప్రాంత వాసులు,విద్యావేత్తలు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సామాన్యుడికి ఉపయోగం లేదు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కార్పొరేట్లకు ప్రయోజనం చేకూర్చే విధంగా కేంద్ర బడ్జెట్ ఉందని, సామాన్యులకు ఏటువంటి ప్రయోజనం చేకూర్చేలా లేదని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మోహనరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.అమ్మన్నాయుడు అన్నారు. రైతు, సామాన్యుల వ్యతిరేక,కార్పొరేట్ అనుకూల కేంద్రబడ్జెట్‌కు వ్యతిరేకంగా చిలకపాలెంలో ఏపీ రైతుసంఘం, సిఐటియు ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఉపాధి హామీకి గత బడ్జెట్లో రూ.86వేల కోట్లు ఇచ్చారని, ఇప్పుడు కూడా రూ.86వేల కోట్లేనన్నారు. ఉపాధి హామీ చట్టానికి కనీసం రూ.2.5 లక్షల కోట్లు కేటాయిస్తే గ్రామీణ ప్రాంతాల నుంచి వలసలు తగ్గుతాయని, కొనుగోలు శక్తి పెరుగుతుందన్నారు. మోడీ దృష్టిలో ఉపాధి అంటే అంబానీ, అదానీ, కార్పొరేట్లకు ఉపాధి కల్పించడమేనని విమర్శించారు. రైతులకు అత్యంత ముఖ్యమైనది యూరియా అని, పోయిన బడ్జెట్లో యూరియాకు ఎంత కేటాయించారో ఇప్పుడు అంతే కేటాయించారన్నారు. వ్యవసాయానికి సరిగ్గా నిధులు ప్రకటిస్తే రైతు బతుకుతాడని, ఈ ప్రభుత్వానికి అది ఇష్టం లేదని, విలువైన వ్యవసాయరంగంపై అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్లకు వ్యవసాయాన్ని కట్టబెట్టడానికి వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలకు నిధులు తగ్గించిందని విమర్శించారు. విద్య, వైద్య రంగాలకు అవసరమైన నిధులు కేటాయించలేదన్నారు. అంగన్వాడీ కేంద్రాల పరిధిలో 8కోట్ల మంది మూడేళ్లలోపు చిన్నారులు, కోటిమంది వరకు గర్భిణీలున్నారని అటువంటి దానికి పోషణ్-1, పోషణ్-2 రెండింటికీ బడ్జెట్లో కోత విధించారని విమర్శించారు. పేదరికాన్ని నిర్మూలించాలంటే ఆహార భద్రతకు ఎక్కువ నిధులు కేటాయించాలని మోడీ ప్రభుత్వం క్రమంగా తగ్గిస్తూ పోయినేడాది రూ.2.03 లక్షల కోట్లకు కుదించి ఇప్పుడు రూ.2.04 లక్షల కోట్లు ఇచ్చేస్తున్నామని ప్రకటించి పేదరికం లేని భారతాన్ని ఎలా సృష్టిస్తారని ప్రశ్నించారు. దేశంలో 65శాతం ప్రజలు గ్రామీణ ప్రాంతంలో ఉన్నారని, పోయిన సంవత్సరం గ్రామాలకు రూ.2.60 లక్షల కోట్లు కేటాయించి రూ.75 వేల కోట్ల కోత విధించి 1.90 లక్షల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టారంటే గ్రామాల అభివృద్ధికి ఇక ఖర్చు పెట్టలేమని పార్లమెంట్ సాక్షిగా మోడీ సర్కారు తెగించి చెప్పడమేనన్నారు. వ్యాధులకు ప్రధాన కారణం తాగునీరు శుభ్రంగా లేకపోవడం, సరైన ఆహారం అందకపోవడమేనని ఐక్యరాజ్యసమితి ఘోషిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు టి.నందోడు, కోరాడ అప్పన్న, బి.అప్పలరాజు, తోనంగి ఉమ, ఆర్.సూరమ్మ, టి.అసిరమ్మ, టి.రాజప్పడు, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీ బతుకులు బుగ్గిపాలు చేయవద్దు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

థర్మల్ పవర్‌ప్లాంట్ నిర్మించి ఆదివాసీ బతుకులు బుగ్గిపాలు చేయొద్దని ఆదివాసీ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబయోగి డిమాండ్ చేశారు. సరుబుజ్జిలి, బూర్జ మండలాల పరిసర గ్రామాల్లో నిర్మించి తలపెట్టిన థర్మల్ పవర్‌ప్లాంట్ నిర్మాణ ప్రతిపాదన ఆపాలని బుధవారం నాడు వెన్నెలవలస గ్రామంలో ఆదివాసిలు, పరిసర ప్రాంత రైతులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి సురేష్‌దొర అధ్యక్షత వహించారు. ఈసమావేశంలో రెండు మండలాలకు చెందిన 20 గ్రామాలను రైతులు, ఆదివాసీలు పాల్గొన్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా వాబ యోగి రాష్ట్ర ఉపాధ్యక్షులు పాల్గొని ప్రసంగించారు. ఈజిల్లాలో సోంపేట కాకరపల్లిలో థర్మల్ విద్యుత్ ప్లాంట్ వద్దనే ప్రజలు పెద్దఎత్తున ఉద్యమం చేసి అక్కడ పర్యవనం పచ్చదనాన్ని కాపాడుకున్న విషయం ప్రభుత్వం మరిచిందన్నారు. సోంపేట థర్మల్ విద్యుత్ ప్లాంట్ జి.ఓ కూడా ఇదే తెలుగుదేశం ప్రభుత్వం రద్దు చేసిన విషయం కూడా మరిచిందన్నారు. థర్మల్‌ప్లాంట్ వల్ల నష్టాలను వివరించారు. ఇది మానవాళి వినాసానికి కారణమవుతుందన్నారు. పవర్‌ప్లాంట్ నుండి వెలువడే యాస్, భూగర్భజలాల్లోకి వెళ్లి పర్యావరణం, పంటలతోపాటు తాగునీరు, సాగునీరు, కలుషితం చేసి అనేక వ్యాధులకు కారణమై మానవాళి మనుగడ పూర్తిగా అంతరించిపోయే ప్రమాదం ఉందన్నారు. 3200 మెగావాట్ల పవర్‌ప్లాంట్‌కు చాలా నీరు అవసరమవుతుందన్నారు. వంశధార రిజర్వాయర్‌లో ఆరు టీఎంసీల నీరు మాత్రమే ఉందన్నారు. ఈనీరు పవర్‌ప్లాంట్‌కు తరలిస్తే దిగువున ఉన్న లక్షలాది ఎకరాల భూమికి మీరు ఎలా అందుతుందన్నారు. రైతు ఎలా పంటలు పండిస్తారన్నారు. ఇప్పటికే రైతుకు నీరు అందించలేని పరిస్థితి మనం చూస్తున్నామన్నారు. ఆదివాసిలు పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనాధారం గడుపుతుంటే ఆదివాసులు పొట్ట కొట్టే ప్రయత్నం ఆపుకోవాలన్నారు. ఇదే వెన్నెలవలసలో రెండు విద్యాలయాలు ఉన్నాయని, ఒకటి నవోదయ, రెండు గిరిజన ఆశ్రమ పాఠశాల నవోదయ 1988 సంవత్సరంలో ఏర్పడిందన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాల 2000 సంవత్సరంలో ఏర్పడిందని, ఇక్కడ వేలాది మంది విద్యార్థులు విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరారన్నారు. ఈపవర్ ప్లాంట్ వల్ల విద్యాలయాలు కూడా పూర్తిగా అంతరించిపోతాయన్నారు. చుట్టుపక్కల ఉన్న ఆదివాసి గ్రామాలకు, విద్యాలయాలు కూడా నాశనమవుతాయన్నారు. పవర్‌ప్లాంట్ వ్యతిరేక ఉద్యమానికి జిల్లాలో మేధావులంతా కూడా పార్టీలకతీతంగా వచ్చి ఉద్యమంలో పాల్గొని ఆదివాసిలకు, రైతులకు అండగా ఉండాలని వాబ యోగి కోరారు. సమావేశం అనంతరం కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో వంకల మాధవరావు, కోత ధర్మారావు, రవికాంత్, సింహాచలం, సవర ధర్మారావు, కృష్ణారావు, పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌పై నిరసన
## లేబర్ కోడ్ అమలు చేయాలి

(సత్యంన్యూస్, టెక్కలి)

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్లో వ్యవసాయ రంగానికి నిధుల కోత, కార్మిక రంగంలో లేబర్ కోడ్లు అమలుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలకు సిఐటియు, రైతు సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు టెక్కలి చిన్న బజార్ జంక్షన్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. బడ్జెట్లో వ్యవసాయ రంగంకు నిధులు తగ్గించారని, నాలుగు లేబరు కోడులను తీసుకువచ్చి నేడు అవి అమలుజరపడం ద్వారా కార్మికులు ఎటువంటి హక్కులు లేకుండా బానిసల్లా అదనపు పనిగంటలు పనిచేయవలసి వస్తుందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు హెచ్.ఈశ్వరరావు అన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను బిజెపి ప్రభుత్వం అధికారబలంతో మార్పులు చేయడం కార్మిక వ్యతిరేక చర్య అని సిఐటియు నాయకులు నంబూరు షణ్ముఖరావు అన్నారు. రైతాంగ వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల కేంద్ర బడ్జెట్‌ను రైతాంగం తీవ్రంగా వ్యతిరేకించాలని రైతుసంఘం నాయకులు బగాది వాసుదేవరావు అన్నారు. అన్ని గ్రామాల్లో నిరసన సభలు నిర్వహించాలని పిలుపు ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు, కార్మికులు జోగికుమార్, యన్.శంకర్, యస్. వెంకటరావు, గేదెల వసంతులు, పి.ధనుంజయ, కమలమ్మ, దేవిలు పాల్గొన్నారు.




# 9న మిస్టర్ ఆంధ్ర పోటీలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలో పీఎస్ఎన్ఎంఎ స్కూల్‌లో ఈనెల 9న మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు శ్రీకాకుళం బాడీ బిల్డర్స్ అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ వి.విజయ్‌కుమార్, అధ్యక్షులు బి.ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు రూ.1.25లక్షల క్యాష్ అవార్డు అందజేస్తున్నామన్నారు. అలాగే మెమెంటోస్ సర్టిఫికెట్ భోజనాలు సదుపాయం కల్పిస్తున్నామన్నారు. అనంతరం శ్రీకాకుళం బాడీ బిల్డర్స్‌కి ఎంపిక చేశారు. ఆముదాలవలసకి చెందిన రాయి హరీష్ (55కేజీల విభాగం), శ్రీకాకుళం ఓజీ జిమ్ శరత్ చంద్ర 65కేజీల విభాగం, జిమ్ కళ్యాణ్ 60 కేజీలు, జిమ్ మోహన్, మెన్స్ ఫిజిక్ శ్రీకాకుళం, ఓజీ జిమ్ ఇబ్రహీం మెన్స్ ఫిజిక్ శ్రీకాకుళం గోపాల్ ఫిట్నెస్ మాస్టర్ క్యాటగిరి అరుగుల భాస్కర్ వీళ్ళకి ఎంపిక చేసినట్లు చెప్పారు ఈ కార్యక్రమంలో సెక్రటరీ విజయకుమార్ అధ్యక్షులు బి ప్రసాద్ నేషనల్ రెఫ్రి బి.సూరిబాబు జాయింట్ సెక్రెటరీ, కె.గౌరీ శంకర్, ఆమదాలవలస టీం కోచ్ శంకర్ యాదవ్, జీవన్ విష్ణు పాల్గొన్నారు



# 200 మందితో సామూహిక సూర్యనమస్కారాలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కొంక్యాన గోవిందరాజులు చారిటబుల్ ట్రస్టు, వాకర్స్ ఇంటర్నేషనల్-102 గవర్నర్ కొంక్యాన మురళీధర్, షిర్డీసాయి యోగా వాకర్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో 200 మంది మహిళలు 108 సూర్యనమస్కారాలు సామూహికంగా మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు డాక్టర్ మధు విలేకర్, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, డాక్టర్ బొడ్డేపల్లి సురేష్, డాక్టర్ హర్షవల్లి మహిళలకు ఆరోగ్య సూత్రాలు వివరించారు. కొంక్యాన ట్రస్టు డైరెక్టర్ వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రిటైర్డ్ జిల్లా జడ్జి పప్పల జగన్నాథరావు, వాకర్స్ గవర్నర్ కొంక్యాన మురళీధర్, వాకర్స్ ప్రతినిధులు వివేకానంద, సుగంధం సంజీవరావు, యోగా గురువులు రామారావు, నాగేశ్వరరావు, పాండ్రంకి మురళీకృష్ణ, తంగి స్వాతి పర్యవేక్షణలో సామూహిక సూర్యనమస్కారాలు నిర్వహించారు.

# పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ముహూర్తపురాట

(సత్యంన్యూస్, రాజాం)

ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం రాజాం శ్రీ పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతర ముహూర్తపురాట బుధవారం కమిటీ పెద్దలు స్థానిక పురజనులు ఘనంగా నిర్వహించారు. ఉదయం 9గంటల 9 నిమిషాలకు ముహూర్తపురాట వేశారు. అనంతరం మార్చి నెలలో 9 10 11 తేదీలలో జరగబోయే అమ్మవారి యాత్ర మహోత్సవం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈవో బీవీ మాధవరావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యుల సారధ్యంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు వేమకోటి సూర్యనారాయణ శర్మ, కార్యనిర్వహణ అధికారి మాధవరావు, ఆలయ వంశపార ధర్మకర్త వాకచర్ల దుర్గాప్రసాద్, రాజా, పైడిరాజు, తాతీయులు, సలాది వెంకటరమణ, కళాపరిషత్ అధ్యక్షుడు సలాది తులసీదాస్, గంది గోపి, ఆరినపల్లి వెంకటనాయుడు, సలాది మహేష్, వెంపల లక్ష్మణరావు, పెంకిచైతన్యకుమార్, రెడ్డి విజయ్ కుమార్, పింకీ, గౌరీశ్వరరావు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

భాస్కర టూర్స్ & ట్రావెల్స్
ఆన్‌లైన్ వర్క్స్
ఇ-రిజర్వేషన్, బస్ టిక్కెట్స్, వాల్వో ఎ/సి, నాన్ ఎ/సి, రైల్వే ఫ్లైట్ టిక్కెట్స్ మొదలైనవి చేయబడును.
ఆర్ట్స్ కాలేజ్ రోడ్, అంబేద్కర్ జంక్షన్ దగ్గర, శ్రీకాకుళం.
సెల్: 77320 63656, 80967 20076
btsrikakulam@gmail.com

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వేజోన్..

# ఉత్తర్వులు జారీ



(సత్యంన్యూస్, విశాఖపట్నం)

నాలుగు డివిజన్లతో విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వేజోన్ ఏర్పాటుచేయనున్నారు. ఇందులో విశాఖ, విజయవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజన్లు ఉండనున్నాయి. ఈమేరకు రైల్వేశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్ష నెరవేరిందని ఎంపీ శ్రీభరత్ అన్నారు. ఇది కూటమి ప్రభుత్వం మరో విజయమన్నారు. విశాఖ రైల్వే అభివృద్ధిలో చరిత్రాత్మక ముందడుగు అని అభివర్ణించారు. వాల్తేరును విశాఖ డివిజన్ పునర్ నామకరణం చేయడం హర్షణీయమని శ్రీభరత్ పేర్కొన్నారు.

## సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకుంటామని, ఆయా శాఖ అధికారులకు సమస్యను వివరించి పరిష్కరించమని ఆదేశించామని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. తన కార్యాలయంలో బుధవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. శ్రీకాకుళం రూరల్, గార మండలాలతో పాటు శ్రీకాకుళం నగరం నుంచి వచ్చినవారి నుంచి ఫిర్యాదులు సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సమస్యలు నేరుగా కార్యాలయానికి తెలియజేయాలని, తమ దృష్టికి తీసుకువస్తే ఆయా శాఖ అధికారులకు సమాచారం ఇచ్చి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, ఇప్పటికే నియోజకవర్గ ప్రజలకు ప్రజాదర్బార్ ద్వారా అనేక సమస్యలు పరిష్కరించామన్నారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, అధికారులకు సమాచారం ఇచ్చి పరిష్కరించాలని సూచించారు.

# బడ్జెట్ గుట్టు.. ఆమె చీర చెప్పేస్తుంది!

- నిర్మలా సీతారామన్ అంకెలపై విశ్లేషకులు కుస్తీ పట్టక్కర్లేదు
- ఆమె కట్టుకున్న చీర ఏ రాష్ట్రానిదో చెప్పగలిగితే సారం తెలిసినట్లే
- వరుసగా ప్రవేశపెడుతున్న బడ్జెట్లలో రాష్ట్రాల ప్రాధాన్యత పసిగట్టేస్తున్న మహిళలు





కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దేశ బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడు కట్టుకున్న చీరను బట్టి ఏ రాష్ట్రానికి ఆ బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వబోతున్నారో ఇకనుంచి ఇట్టే పట్టేయొచ్చు. కేంద్ర బడ్జెట్ పాఠాన్ని పూర్తి స్థాయిలో వినిపించకముందే టీవీ డీబేట్లలో మాట్లాడే విశ్లేషకులు ముందుగా ఇంటి నుంచి బయల్దేరినప్పుడు సీతారామన్ కట్టుకున్న చీరేమిటో టీవీలో చూసి చెప్పమని ఓసారి అడిగితే సరిపోతుంది. ఎందుకంటే.. గడిచిన రెండు బడ్జెట్ ప్రవేశాల నుంచి నిర్మలా ఓ కొత్త పంథాను అనుసరిస్తున్నారు. 2025 బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడు ఆమె కట్టుకున్న చీరను దేశవ్యాప్తంగా మహిళలు ఆసక్తిగా గమనించారు. మంచి రంగుతో చేనేత మీద కళంకారీ డిజైన్ ఉన్న ఆ చీర ఎంత బాగుందో అని బుగ్గలు నొక్కుకున్నారు. కానీ నిర్మల మాత్రం ఆ చీర వెనుక ఓ చరిత్ర ఉందని చెప్పే ప్రయత్నం, ఆ చరిత్ర కలిగిన రాష్ట్రానికే ఈసారి ప్రాధాన్యత ఇస్తున్నామన్న సంకేతం పంపడానికే ఆ చీర కట్టుకున్నారు. ఈ చీర పేరు మధుబని. ఇది కళంకారీ తరహా చేతినేత చీరే. దీంట్లో ప్రావీణ్యం గడించిన దులారీదేవికి కేంద్ర ప్రభుత్వం 2020–21లో పద్మశ్రీ బిరుదు ఇచ్చింది. దులారీదేవి బీహార్‌కు చెందిన మహిళ. అలాగే మధుబని కళ కూడా బీహార్‌దే. రామాయణంలో మిథిలానగరాన్నే ఇప్పుడు బీహార్‌గా వ్యవహరిస్తున్నారని, సీతాదేవి వివాహానికి జనక మహారాజు మధుబని చీరనే కట్టించారని అక్కడి ప్రజలు నమ్ముతారు. ఇప్పుడు నిర్మల అదే చీర కట్టుకొని 2025 బడ్జెట్‌లో బీహార్‌కు వరాల జల్లు కురిపించారు.

సీన్ కట్ చేస్తే.. 2024 ఫిబ్రవరిలో మధ్యంతర కేంద్ర ఆర్థిక బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడు ఇదే నిర్మలా సీతారామన్ జార్ఖండ్‌కు ప్రత్యేకమైన టస్సార్ సిల్క్‌చీర కట్టుకున్నారు. వెస్ట్‌బెంగాల్ నుంచి జార్ఖండ్ ప్రాంతానికే చెందిన టస్సార్ పట్టు సాధారణంగా ఓక్, నేరడి, అసన్, అర్జున్ చెట్లను తినే అంథేరియా మాత్ అనే పట్టుపురుగు గూడుల నుంచి తీస్తారు. ఇందులో జీవహింస ఉండదని, ఈ పట్టు ప్రసిద్ధి. 2024లోనే జార్ఖండ్‌కు ఎన్నికలు ఉన్నందున ఆ బడ్జెట్‌లో ఆ చీర కట్టుకొని వారికి ప్రాధాన్యత ఇచ్చారు. ఆ తర్వాత పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడు మన రాష్ట్రానికి చెందిన మంగళగిరి చేనేత వస్త్రాన్ని ధరించారు. అందులో అమరావతిని రాజధానిగా ప్రకటించిన పోలవరానికి రూ.5,936 కోట్లు కేటాయిస్తే, దాన్ని ఈ బడ్జెట్ వరకు విడుదల చేస్తున్నారు. విశాఖ స్టీల్‌కు రూ.11,917 కోట్లు కేటాయించారు. 2028 వరకు 95.53 లక్షల ఇళ్లకు సురక్షిత మంచినీరు ఇవ్వాలని జలజీవన్ మిషన్‌కు నిధులిచ్చారు. విశాఖ పోర్ట్‌ట్రస్ట్ స్వావలంబనకు రూ.730 కోట్లు ప్రకటించారు. గడిచిన బడ్జెట్ సమావేశంలో రికార్డుస్థాయి టైమ్‌ను 2 గంటల 42 నిమిషాలు నిర్మలా సీతారామన్ మాట్లాడారు. ఆమె చీర బీహార్‌దని, బీహార్‌కే బడ్జెట్ ఉందని అంత ప్రసంగం వినకపోయినా గత చరిత్ర చూసినవారికి అర్థమైపోయి వుంటుంది. మురార్జీదేశాయ్ ఇప్పటి వరకు 10 సార్లు బడ్జెట్ ప్రవేశపెడితే, చిదంబరం 9 సార్లు, నిర్మలాసీతారామన్ 8 సార్లు కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.



- ప్రొ॥ చౌదరి అప్పారావు
హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్స్ (రిటైర్డ్), ఆంధ్రాయూనివర్సిటీ

## అక్రమమని తేలితే కూల్చేయండి

(సత్యంన్యూస్, అమరావతి)

విశాఖపట్నంలోని భీమునిపట్నం బీచ్ వద్ద అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని ఏపీ హైకోర్టు ఆదేశించింది. జిల్లా కలెక్టర్, సీఆర్‌జెడ్ జోనల్ అధికారి, ఇతర అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీచేసింది. భీమునిపట్నం వద్ద చేపట్టిన నిర్మాణాలను కమిటీ పరిశీలించాలని, అవి అక్రమ నిర్మాణాలని తేలితే కూల్చివేయాలని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. తదుపరి విచారణ నాటికి పూర్తి నివేదిక సమర్పించాలని కమిటీని న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. భీమునిపట్నం బీచ్ వద్ద అక్రమ నిర్మాణాలు కూల్చివేయాలని జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్ హైకోర్టులో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే.

## ఎమ్మెల్యే కూనకు అరుదైన గౌరవం

- పీయూసీ చైర్మన్‌గా ఎంపిక చేసిన స్పీకర్ -



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు అరుదైన గౌరవం లభించింది. రాజ్యాంగబద్ధమైన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వరంగ సంస్థల కమిటీ (పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్స్) చైర్మన్‌గా ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను నియమిస్తున్నట్లు అధికారికంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రకటించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. రాష్ట్రంలో మూడు ఫైనాన్షియల్ కమిటీలకు చైర్మన్లను రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు నియమించగా, అందులో కూన రవికుమార్‌కు చోటు దక్కింది. ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు అరుదైన గౌరవం లభించడం పట్ల కూటమి నాయకులు, టీడీపీ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కమిటీకి చైర్మన్‌గా వ్యవహరించే చైర్మన్‌కు ప్రభుత్వ రంగ సంస్థలపై పరిశీలన చేసేందుకు వీలుంటుంది. రాష్ట్రంలో ఏపీఈపీడీసీఎల్, జెన్‌కో, మార్క్‌ఫెడ్, ఎస్పీడీసీఎల్, సీడ్ కార్పొరేషన్, ఆగ్రోస్ తదితర సంస్థల్లో పెట్టుబడులు, నియామకాలు, ఆడిట్ అభ్యంతరాలు, తీసుకున్న చర్యలు, నిధుల వినియోగం, దుర్వినియోగం వంటివాటిపై పరిశీలించి అసెంబ్లీకి నివేదిక ఇస్తారు. అనంతరం ప్రభుత్వ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటుంది. ఈ సందర్భంగా కూన రవికుమార్ మాట్లాడుతూ పీయూసీ చైర్మన్‌గా నియమించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# రథసప్తమి సక్సెస్‌కు వారి కృషి అమోఘం

- కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడు కృషితో ఇది సాధ్యమైంది
- అధికారుల పనితీరు అభినందనీయం
- త్వరలో అరసవల్లి, శ్రీకూర్మం రూపురేఖలు మారుస్తాం
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే గొండు శంకర్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణస్వామి దేవాలయంలో రథసప్తమి ఉత్సవాలు కన్నుల పండుగా, అత్యంత వైభవంగా పూర్తిస్థాయిలో సక్సెస్ కావడంలో జిల్లా అధికారుల కృషి ఎంతో ఉందని, అందువల్లే ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించగలిగామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రథసప్తమి వేడుకలకు గతంలో ఎన్నడూ లేని విధంగా వివిధ ప్రాంతాల నుంచి 1.20 లక్షల మంది భక్తులు స్వామివారిని దర్శించుకోవడం, ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ప్రశాంతంగా స్వామివారిని దర్శించుకోవడం అత్యంత శుభసూచకమైన ఘట్టమని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ రథసప్తమి ఉత్సవాలను రాష్ట్ర పండుగగా చేయడం, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కృషితో ఇది సాధ్యమైందని తెలిపారు. నిరంతర పర్యవేక్షణతో అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు విధులు నిర్వహించడంతో వేడుక సక్సెస్ అయిందన్నారు. రాబోయే రోజుల్లో ఈ దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా తయారుచేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. ప్రసాదం స్కీం కింద డిపిఆర్ కూడా తయారైందని, ఈ స్కీం ద్వారా రాష్ట్ర పర్యాటక కేంద్రాలుగా అందరూ దర్శించుకునే విధంగా అరసవెల్లి పుణ్యక్షేత్రం, శ్రీకూర్మం శ్రీకూర్మనాధుని దేవాలయం రూపురేఖలు మారుతాయని, ఆ దిశగా అడుగులు వేస్తున్నట్టు చెప్పారు. కూటమి ప్రభుత్వంలో ఈ రాష్ట్రపండగ జిల్లాలో మూడు రోజులపాటు నిర్వహించామని, సాంస్కృతిక కళారూపాలు, క్రీడలు, వివిధ రకాల కళాజాతరలో ఏర్పాటు చేశామని, ప్రజలకు కనువిందు చేయగలిగామని తెలిపారు. చిన్న చిన్న పొరపాట్లు గుర్తించి రాబోయే రోజుల్లో జరిగే ఉత్సవాలకు భక్తులకు పూర్తిస్థాయిలో ఇబ్బందులు లేకుండా స్వామివారిని దర్శించుకునే చర్యలు తీసుకుంటున్నామన్నారు. శ్రీకాకుళం నియోజకవర్గాన్ని సర్వాంగ సుందరంగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తున్నామని, ఇప్పటికే పెద్దపాడు రోడ్డు, పట్టణంలోని డివైడర్లు, మురుగు కాలువలు, డ్రైనేజీ వ్యవస్థ.. ఇలా మౌలిక సదుపాయాలు కల్పించగలుగుతున్నామని, ఇంకా ఎన్నో అభివృద్ధి పథకాలకు రూపకల్పన చేశామని తెలిపారు. విలేకరుల సమావేశంలో పాండ్రంకి శంకర్ పాల్గొన్నారు.



## మరమ్మతులు చేయక.. జారి పడుతున్నారు

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

మండల కేంద్రం నుంచి చిన్నరావుపల్లి, అజ్జరాం, కొయ్యం, తదితర గ్రామాలకు వెళ్లే రోడ్డు మార్గాన్ని మరమ్మతులు చేయడానికి పిక్కలను వేశారు. అయితే ఎప్పటికీ మరమ్మతులు చేపట్టక పోవడంతో ఆ పిక్కలు కాస్త రోడ్డుపైకి వచ్చాయి. దీంతో ద్విచక్ర వాహనాలు జారిపడుతున్నాయని, ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వాహనదారులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

## తూర్పుకాపు ఆణిముత్యాలకు అభినందన సత్కారం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



నీతి నిజాయితీ, నిబద్ధత కలిగిన తూర్పుకాపు సామాజిక వర్గం ప్రతినిధులు లంక గాంధీ, శాసపు జోగినాయుడులకు మంగళవారం రాత్రి జిల్లా తూర్పుకాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అభినందన సత్కారం చేశారు. శ్రీకాకుళం జిల్లా బంగారు వర్తక సంఘం అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన లంక గాంధీని, జర్నలిజంలో విశేష ప్రతిభా పాటవాలు చూపే సీనియర్ జర్నలిస్ట్, జాతి పట్ల అమితమైన అభిమానం ఉన్న జోగినాయుడులకు జిల్లా తూర్పుకాపు సంఘం, ఉద్యోగ సంఘం సంయుక్తంగా ఘన సత్కారం చేశారు. జిల్లా తూర్పుకాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు సురంగి మోహనరావు అధ్యక్షతన జరిగిన ఈ సత్కార కార్యక్రమంలో తూర్పుకాపు సామాజిక వర్గం ప్రతినిధులు డోల జగన్, ఇజ్జాడ శ్రీను, ప్రత్యేక అతిథులుగాను, సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ ముఖ్య అతిథిగాను, ఆత్మీయ అతిథిగా బీజేపీ నేత సోనాపురం కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘం నాయకులు డాక్టర్ ముచ్చెర్ల రామజోగినాయుడు, కిల్లారి నారాయణరావు, అంకడాల తవిటన్న, దన్నాన మోహన్, కురిటి దుర్గారావు, డాక్టర్ చందక రామకృష్ణ, నేతల అప్పారావు, మెంటాడ సాంబమూర్తి, తూర్పుకాపు సంక్షేమ సంఘం నేతలు డోల బాల వంశీకృష్ణ, ఎస్.సత్యనారాయణ, పతివాడ సురేష్, వ్యాయామ ఉపాధ్యాయులు బొత్స శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.












Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.